కన్నకొడుకు
ద్వేషిస్తే
ఆ తల్లికి
దిక్కెవరు?

# కొడుకు

కర్లపూడి విజయలక్ష్మి కథ

"ఏమిటీ! ఈ సాకుతో అందర్నీ తెచ్చి నా నెత్తినెక్కిస్తానంటే మాత్రం చచ్చినా ఒప్పుకోను" నాంచారి మాటలు తుపాకి గుళ్లలా దూసుకొచ్చాయి.

"అహా... అదికాదు నాంచారీ! ఆ పల్లెటూళ్లో సరైన ట్రీట్‌మెంట్ దొరకదు. ఇక్కడైతే మంచి డాక్టర్... మందులు... అందుని కొన్నా...ళ్లు. .."

'వీల్లేదు... చచ్చినా వీల్లేదు. రోగం కోసం మీరు వేలుకువేలు తగలెయ్యడం... నేనేమో ఆ గుంపుకందరికి వడ్డి విరగ్గొట్టుకుంటూ వండి వార్చడం... నావల్లకాదు" భర్త మాటలని మధ్యలోనే అందుకుని తారాజువ్వలా ఎగిరింది.

"ఆఫీసునుండొచ్చి అరగంటయ్యింది. ఓ కప్పు కాఫీ నా ముఖాన పొయ్యరాదు" నాంచారికి ఏం జవాబుచెప్పాలో అర్థంకాక కాఫీ అడిగాడు మంగపతి.

ఆ... ఆ ఎందుకు పొయ్యనూ రుసరుసలాడుతూ కిచెన్‌లోకి వెళ్లింది నాంచారి.

ఆ కాస్త సమయాన్ని ఉపయోగించుకుంది అతని బుర్ర. ఇదిగో కాఫీ టీపాయ్ మీద పెద్దగా చప్పుడుచేస్తూ పెట్టింది కప్పు.

"చూడు నాంచారీ! నువ్వెందుకు చాకిరీ చేసి అలసిపోయి హైరానా పడడం. మా చెల్లి శాంభవి వుందికదా. అదే చూసుకుంటుంది. ఇంటిపని... వంటపని... పిల్లల పని... నీకు కాస్త విశ్రాంతిగా వుంటుంది ఏమంటావు?" ఆమెని కన్విన్స్ చేయబోయాడు కప్పు చేతిలోకి తీసుకుని.

"ఛట్! నా ఇల్లు దానికి అప్పగించి నేను బెడ్రూములో దూరి రెస్ట్ తీసుకోవడం



ఏంటి? ఇంటి పెత్తనం వాళ్లకప్పగించి నన్నో మూలన పడి వుండమని ఇండైరెక్ట్‌గా చెప్తున్నారా ?"

"ఇదిగో చూడండి పదిమంది వున్న కొంపలో పెరిగినదాన్ని. కూడుకి గుడ్డకే కాదు. ప్రశాంత జీవనానికి కూడా కరువున పడినదాన్ని. ఇప్పుడేమో వాళ్లని తెచ్చి నా ఇంటిని సత్రంగా మార్చితే వూరుకోను"

కాఫీ తాగుతున్న మంగపతికి పొరమారిం ది. దగ్గుతూ కప్పు కిందపెట్టేశాడు.

ఆటలమండొచ్చిన వర్షం... శ్రీహర్షలు మమ్మీ డాడీలు పోట్లాటలో బిజీగా వుండడం చూసి కామ్‌గా స్నానాలుచేసి బుద్ధిగా పుస్తకాలు ముందేసుకున్నారు.

"మరీ అలా విరిచేసినట్టు మాట్లాడితే ఎలా నాంచారీ?

"ముందు మీరు నోరుమూసుకోండి! అసలు మీవాళ్లంటేనే అసహ్యం నాకు. వాళ్ల మాటంటేనే వంటికి కారం రాసుకున్నట్టుంటుంది. నా ఇంట్లో వాళ్ల ఉనికే భరించలేమ అలాంటిది వాళ్లని తెచ్చి ఏకంగా ఇంట్లో వుంచుతారా?"

"పర్మినెంట్‌గా కాదులే టెంపరరీగా" సవరించాడు మంగపతి.

"కాస్త పందిస్తేనా అయినదానికి కానిదానికి పోలోమంటూ పరుగెత్తుకొచ్చి కొంపమీద పడి మేస్తారు. అర్థమయ్యిందా? అంతకీ కావాలంటే వాలుగైదొందలు వాళ్ల మొహాన పడేయండి. వాళ్లేప్పేదో వాళ్లు చూసుకుంటారు... వాళ్ల చావేదో వాళ్లు ఛస్తారు" చేతులు తిప్పుకుంటూ అత్తింటిమీదున్న తన గొప్ప అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది నల్లటి మొహాన్ని మరింత నల్లగా మాడ్చుకుంటూ.

నోటికి ప్లాస్టర్ వేసినట్టు సైలెంట్ అయిపోయాడు మంగపతి ఏమీ తోచక తలగోక్కున్నాడు కాసేపు. తర్వాత పెళ్లాం చెబితే వినాలికాబట్టి అలా ప్రాసీడవ్వాలనుకున్నాడు. లేకపోతే ఫుడ్ నిల్... బెడ్‌కూడా...

కాసేపు భర్త ముఖంలోని ఫీలింగ్స్‌ని చూసి ఇహ పెదవి కదిపే అవకాశం లేదులే అనుకుని కప్పు తీసుకుని లోనికి వెళ్లింది.

అది రేపో మాపో కూలిపోవడానికి సిద్ధంగా వున్న పాత పెంకుటిల్లు. వాళ్ల జీవితాల్లాగానే రంగు వెలసిన గోడలు. ప్రహరీమండి ఇంటివరకు వున్న ఖాళీస్థలంలో అందంగా తలలూపుతున్న అందమైన గులాబీ మొక్కలు. మరోవేపు వంగ... బెండ... పచ్చిమిర్చి... టమోటా... గోంగూరా... తోటకూరా.. కొత్తిమీరా మొదలైన మళ్లున్నాయి.

అన్నపూర్ణమ్మ మనసు బావుండనప్పుడు ఆ మొక్కల మధ్య చేరి పాదులు తవ్వడం... కలుపు మొక్కలు తీయడం చేస్తుంటుంది. గేటు చప్పుడైతే తల తిప్పి చూసింది. సూర్యుడు పడమటి కొండ చాటుకి చేరి చాలాసేపయ్యిందేమో వచ్చిన వ్యక్తిని పోల్చుకోలేక ఎవరూ అంటూ ఓసారి కళ్లజోడు తీసి పైటచెంగుతో తుడిచిపెట్టుకుంది.

"నేనేనమ్మా మంగని"

ఆ కంఠస్వరం పోల్చుకోగానే ఆమె వదనం ఆనందంతో వెలిగింది. కళ్లు జ్యోతుల్లా మెరిశాయి. చేతులు భూమిమీద ఆన్చి పైకిలేచి "నువ్వా మంగా? ప్రయాణం బాగాజరిగిందా?" దగ్గరగా వస్తూ అడిగింది.

కోడలూ... పిల్లలూ బావున్నారా? వాత్సల్యంతో అతని చేతిమీద తన చేయివేసి నిమిరి... చేతిలో బ్యాగు అందుకుంది అన్నపూర్ణమ్మ.

"ఆ.. ఆవాళ్లకేం రోగం ముప్పొద్దులా తిని దిబ్బరొట్టెల్లా బానే వున్నారు" కోపం

గా అన్నాడు మంగపతి.

శాంభవి చెంబుతో ఇచ్చిన నీళ్లతో కాళ్లు కడుక్కుని... తల్లి ఇచ్చిన టవల్ అందుకుంటూ అడిగాడు. "నాన్న ఆరోగ్యం ఇప్పుడెలా వుంది? ఏమైనా ఆహారం తీసుకుంటున్నారా?


అన్నపూర్ణమ్మ మొహాన్ని విషాదపు మబ్బులు కమ్మేశాయి. కళ్లు కన్నీటి మడుగులయ్యాయి. "అలానే వుందిరా! ఏం మార్పు కనిపించలేదు. నాకు భయంగా వుందిరా మంగా! పట్నం తీసుకెళ్తే ఏమన్నా గుణం కనిపించవచ్చంటున్నారందరూ" కళ్లొత్తుకుంటూ చెప్పింది.

మౌనంగా తండ్రి గదిలోకి నడిచాడు మంగపతి. శివరామయ్యగారు నిద్రపోతున్నారు. ప్రక్కనే వున్న కుర్చీ తండ్రి మంచం దగ్గరకి లాగి కూచున్నాడు. ఆ శబ్దానికి కూడా మెలకువ రానంత గాఢనిద్రలో వున్న తండ్రిని లేపడం ఇష్టంలేక తదేకంగా ఆయన మొహంలోకిచూస్తూకూచున్నాడు.

నెలరోజులుగా ఎండ మొహం చూడక పోవడంవల్ల కాబోలు చామనచాయగా వుండే ఆయన శరీరం తెల్లగా పాలిపోయింది. శుష్కించిన దేహం ఎముకల గూడులా వుంది. లోపలికి పోయిన దవడలు... చిందర వందరగా వున్న జుత్తు... బాగా పెరిగిన గడ్డం. నలుపు తెలుపుల కలనేతలా వుంది. తెల్లటి పంచె... చొక్కా... పరిశుభ్రమైన పక్కబట్టలు.

అంత నిద్రలోకూడా ఆయన మొహంలో ఏదో దిగులు కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఏవో సమస్యల తాలూకా తీవ్రత ఆయన్ని వెంటాడుతున్నట్టు మూసిన రెప్పమాటు కనుగుడ్లు ఆందోళనగా కదలడం స్పష్టమవుతోంది.

ఆ స్థితిలో తండ్రిని చూసిన మంగపతి గుండె పిండినట్టయింది. తండ్రి అనారోగ్యంతో పడకెయ్యడం ఇంతవరకు తానెరగడు.



గెడ్డం మాయగా ఎప్పుడూ మాడ్లేదు. రోజూ షేవ్ చేసుకుని మున్నటి గెడ్డంతో... తెల్లటి ఇస్త్రీ బట్టల్లో మిలమిలా మెరిసిపోయే తండ్రి ఇలా... ఇలా ఒక్కసారిగా గుండె బరువెక్కింది. దుఃఖం పెల్లుబికింది. చెక్కిళ్లమీద కన్నీరు కాలువలు కట్టింది. పక్కనే వున్న శాంభవి... అన్నపూర్ణమ్మ కూడా కళ్లొత్తుకున్నారు.

భోంచేసి వక్కపొడి వేసుకుని వాలు కుర్చీలో కూచున్నాడు మంగపతి. అతని పక్కనే గోడవి ఆనుకుని కూచుంది అన్నపూర్ణమ్మ కొడుకువచ్చిన తర్వాత ఆమెకి కాస్త ధైర్యం వచ్చింది. మనసుకి కొంత విశ్రాంతి... ఊరట కలిగింది. ఆమె తేలిగ్గా నిట్టూర్చింది. హమ్మయ్య! మంగ వచ్చాడుగా అంతా వాడే చూసుకుంటాడు. నెంరోజులుగా తను, శాంభవి ఎంత అవస్థ పడ్డారు. మగదిక్కు లేక. ఇప్పుడు చేదుకోటానికి ఆదుకోటానికి చెట్టంత కొడుకున్నాడు. వాళ్ల నాన్నని పట్నం తీసుకెళ్లి మంచి వైద్యం ఇప్పించటంకోసం వచ్చాడు.

తండ్రికి ఏ కొరత లేకుండా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పువ్వులా చూసుకుని కళ్లల్లో వత్తులు వేసుకుని కాపాడుకుంటాడు. తన్ని అల్లారుముద్దుగా పెం‌చ తండ్రంటే మంగకి ఎంత ప్రేమో అందుకే ఉత్తరం రాయగానే రెక్కలు కట్టుకుని వచ్చి వాలాడు

అన్నపూర్ణమ్మ ఆలోచనలు ఇలా సాగుతున్నాయి.

మంగపతికి తన మనసులో మాటలని ఎలా చెప్పాలా? అని రకరకాలుగా ఆలోచిస్తున్నాడు.

తండ్రి గదిలో అలికిడికి లేచి వెళ్లాడు మంగపతి. శాంభవి ఏదో జావలాంటిది తండ్రిని కొద్దిగా పైకిలేపి తాగిస్తోంది. కొడుకుని చూడగానే వెలుగు నిండిన కళ్లతోనే పలకరించారు. "నాన్నా" బావున్నావా? అన్నట్టు.

నాన్న మీ ఆరోగ్యం ఎలా వుంది? కుర్చీలో కూచుని తండ్రి చేతిని తన చేతిలోకి తీసుకుని మార్దవం నిండిన గొంతులో అడిగాడు.

కొడుకువేపు సజలనయనాలతో చూశారు. మెల్లగా తలతిప్పి పక్కనే నిలబడ్డ కూతురివేపు చూశారు. ఆ చూపులో ఎన్నో అర్థాలు... ఊరడింపులు... ఓదార్పులు. అమ్మా శాంభవీ! ఈ ముసలి తండ్రికోసం కన్నీటిని వృథా చేయకు తల్లీ. నేను మరీ అంత స్వార్థపరుడ్ని కాదు తల్లీ. నిన్ను ఓ అయ్య చేతిలో పెట్టే నాదారి నేను వెదుక్కుంటాను. పిచ్చితల్లీ! నా కంఠంలో ప్రాణముండగా నిన్ను అనాథని చేస్తానా?

"నాకేమీ ఫరవాలేదురా! కాకపోతే ఓ కాలు, చెయ్యి కదల్చలేకపోతున్నాను. అది నాకు పెద్ద ఇబ్బందిగా లేదు. ఏదన్నా సంబంధం చూడు. శాంభవికి కూడా మూడు ముళ్లువేయించి ఓదారి చూపితే నాకు ఉన్నదంతా నిశ్చింతే"

శాంభవి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక పైటచెంగు నోటికడ్డం పెట్టుకుని లోపలికి పరుగెత్తింది.

"ముందు మీ ఆరోగ్యం కుదుటపడనివ్వండి... ఆ తర్వాత అమ్మాయి పెళ్లి ప్రయత్నాలు చేద్దాం" అంది అన్నపూర్ణమ్మ

ఓదార్పుగా.

అవున్నాన్నా! ముందు మీ ట్రీట్‌మెంట్ తీసుకుంటూ ధైర్యంగా వుండండి. చెల్లాయి గురించి తర్వాత ఆలోచిద్దాం.

''లేదురా...అ లా అనకు ముందు... ముందు... దాని పెళ్లి వా ... కళ్లముందు... జరి...గి...పో...వాలి'' ఆయాసపడుతూ అ న్నారు.

''అమ్మా! ఈ వెయ్యి వుంచు'' మరుస టిరోజు వెళ్లే ముందు డబ్బు తల్లి చేతిలో పెట్టాడు.

ఆశ్చర్యపడి చూసింది అన్నపూర్ణమ్మ.

''నాన్నా! మిమ్మల్ని తీసుకెళ్లడానికే వ చ్చాను. మీకు బాగవుతుంది. ఇదివరలోలా మీరు మామూలుగా తిరుగుతారు'' అని మనసుకి స్వాంతన కలిగించే ఒక్కమాట అనలేదు. ధైర్యం కలిగించేలా మాట్లాడలేదు. అసలు ఎందుకు వచ్చినట్టు? కొడుకు ప్రవర్తనకి గుండెలుపగిలేలా ఏడ్వాలో... తా ము వంటరివారైనందుకు బాధపడాలో... కొడుకు బాధ్యతారహితంగా వున్నందుకు దుఃఖించాలో అర్థంకాలేదు''


నాన్న ఖర్చులకోసం వుంచమ్మా... అ యోమయంగా చూస్తూన్న తల్లితో చెప్పాడు

అప్పుడు నోరువిప్పింది అన్నపూర్ణమ్మ ''మీ నాన్నకి పెరాలసిస్ వచ్చింది... అక్కడ మంచి వైద్యం చేయించమని ఉత్తరం రాస్తే! పరాయివాడిలా వచ్చి పరామర్శించిపోటానికే నా వచ్చింది? మీ నాన్నని పట్నం హాస్పిటల్లో అడ్మిట్ చేయమనికదా నీకు మరీ మరీ వుత్తరం రాస్తే? మేము నీకు కానివాళ్లం అయిపోయావేమిట్రా?'' నిలదీసింది.

''నేను అలానే అనుకున్నానమ్మా.... కానీ... కానీ....'' నసిగాడు.

''కానీ ఏమిట్రా?''

మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లడానికి నాం చారి అంగీకరించట్లేదమ్మా... నాన్న ట్రీట్



మెంట్‌కోసం మీరు మా ఇంట్లో వుండడం ఆమెకిష్టంలేదు.

ఎందుకు? ఎందుకు... అంత పాపం ఏం చేశాము.

“ఏమో... మిమ్మల్ని అక్కడికి తీసుకొస్తే వురిపోసుకు ఛస్తానంటోంది. అమ్మా! ఇప్పుడు నన్నేం చేయమంటావో నువ్వే చెప్పు. నాన్నకి చక్కని వైద్యం చేయించి ఆయనకి సేవలు చేసుకోవాలని... పితృరుణం తీర్చుకోవాలని నాకూ వుంది. కానీ... కానీ అదసలే మొండిది. తన మాట నెగ్గించుకోటానికి ఎంతకైనా తెగిస్తుంది. అది లేకపోతే నా పిల్లలు త...ల్లి...లే....” మంగపతి గొంతు జీరపోయింది.

“అంత మాటనకు మంగా! పచ్చగా పది కాలాలు బతకాల్సినవాడివి మాకోసం మీరు పోట్లాడుకోవద్దు. మీరు సుఖంగా వుండండి. అంతే చాలు. అంతా ఆ దేవుడిదే భారం” రెండు చేతులు ఎత్తి జోడించింది.

“ఆయనకి ఆయుష్షు వుంటే ఎక్కడున్నా బ్రతుకుతారు. ఏంటో నా తాపత్రయంగాని భగవంతుడు నా నుదుటున ఎలా రాస్తే అలా జరుగుతుంది. దానికోసం నీ మనసు కష్టపెట్టుకోకు” కొడుకుని ఊరడించి పంపింది.

అనుకోకుండా శాంభవికి పెళ్లి జరిగి అత్తవారింటికెళ్లిపోయింది.

శాంభవి కట్నంకోసం బ్యాంకులో వుంచిన యాభై వేలలో ఇరవై వేలు శివరామయ్యగారికోసం ఖర్చయింది. కట్నం నిమిత్తం పాతికవేలు ఇవ్వమని అడిగారు శివరామయ్యగారు.

“నాన్నా శాంభవికి కట్నం మొత్తం నేనే ఇవ్వాలనుకున్నాను. కానీ... కానీ డబ్బంతా దానిపేర బ్యాంకులో వుంది. పాతికవేలు ఇమ్మని ఎంత బతిమాలినా వినడంలేదు. “ఆ డబ్బు నా పిల్ల పెళ్లికోసం దాచాంగానీ వూళ్లో వాళ్లందరి పెళ్లిళ్లకోసం కాదు” మీరు నాకు తెలీకుండా డబ్బిస్తే నేను కిరోసిన్ పోసుకుని కాల్చుకు ఛస్తానని బెదిరిస్తోంది. ఏం చెయ్యాలో నాకు తోచట్లేదు. పోనీ మీరే చెప్పండి?”

“ఛీఛీ అంత గయ్యాళిదాన్ని తెచ్చి నాకు కట్టబెట్టారు... వొట్టి జగమొండి. ప్రతి దానికి వ్యతిరేకమే ఎడ్డెమంటే తెడ్డెమంటుంది. ప్రతి చిన్న విషయానిక్కూడా పెద్ద రాద్ధాంతం చేసి పోట్లాడుతుంది. అల్లరి చేసి యాగీ చేస్తుంది. సంసారాన్ని బజార్లో పడేస్తుంది. పైగా అలిగి వంటచేయకుండా పడకేస్తుంది. ఆ రాక్షసితో రోజూ వేగలేక ఛస్తున్నాను” మంగపతి మాటల్లో విసుగు... విరక్తి.... రాజీ ధోరణి.

“పోన్లేరా నువ్వుమాత్రం ఏం చేస్తావు” కొడుకు బాధ చూడలేక సొద వినలేక అన్నారు.

బ్యాగులోంచి తీసి తండ్రి చేతిలో వుంచాడు. “ఏవిట్రా? ఇవి”

“పదివేలు నాన్నా. వుంచండి. పెళ్లిఖర్చులకోసం. దానికి తెలీకుండా ఇస్తున్నాలే. నేను ఇచ్చినట్టు వాంచారికి తెలీనివ్వకండి. ఎంతకైనా తెగిస్తుంది. వియ్యాలవారిముందు యాగి చేసినా చేస్తుంది. ఎంతకైనా సమర్థురాలు. బొత్తిగా సిగ్గూ... ఎగ్గూ లేని జన్మ.

కొడుకు మాటలువిని ఏమీ అనలేకపో

యారు. కొడుకు ఎంత సమర్థుడో అర్థమై మిన్నకుండిపోయారు.

మంగా ఇలా ఇస్తున్నందుకు ఏమీ అనుకోకు. ఈ విషయం కోడలికి తెలిస్తే చాలా ఘోరం జరిగిపోతుంది. నీ బ్రతుకు బజార్న పడుతుంది. కాబట్టి ఈ డబ్బు తీసుకో. కొడుకు చేతిలో వుంచారు శివరామయ్యగారు.

తండ్రి మాటకి ఎదురు చెప్పలేని బుద్ధిమంతుడిలా డబ్బు లోపల పెట్టుకున్నాడు మంగపతి.

శివరామయ్యగారిని శారీరక బాధలు ఒకవేపు... కూతురి పెళ్ళి సమస్య మరోవేపు బాధించాయి. కొడుకు భార్యచాటు భర్తగా మిగిలిపోవడం బాధ్యతారహితంగా ప్రవర్తించడం ఆయనలో అశాంతిని కలిగించింది. మంగ నా పెంపకంలో పెరిగినవాడేనా? అన్న అనుమానం మొలకెత్తింది. మంగ డబ్బుసర్దలేనంత అసమర్థుడైనా ఈ పెళ్ళి ఆగిపోదు. తండ్రిగా తానింకా బ్రతికే వున్నాడు. దృఢమైన నిర్ణయానికి వచ్చినట్టు ఆ రాత్రి విశ్రాంతిగా నిద్రపోయారు.

ఆ ఇంటిలో వున్న నలభై ఐదేళ్ళ అనుబంధాన్ని తెంచుకోటానికి చాలా మనస్తాపాన్ని కలిగించిందా దంపతులకి.

"నాన్నా! నా పెళ్ళికోసం ఈ కాస్త నీడని పోగొట్టుకోకండి" తండ్రి చేతుల్లో మొహం దాచుకుని బావురుమంది శాంభవి.

"పిచ్చితల్లీ! కూతురి తలమీద చేయివేసి ప్రేమగా నిమిరారు. ఇంటికి దీపానివి నీవే మరో ఇంటికి వెలుగు నింపడానికి వెళ్ళిపోతుంటే... మా జీవితమంతా అంధకారమే కదమ్మా! ఇంక నీడా... గూడూ అంటూ ప్రాకులాడ్డం వెర్రితనం కదూ! పో... లోపలికెళ్ళి సంతోషంగా వుంటూ" అంటూ శాంభవికి నచ్చచెప్పారు.

జవాబు చెప్పలేక తండ్రివేపు బేలగా చూసింది శాంభవి.

## నోబాల్

క్రికెట్ మ్యాచ్ జరుగుతూంది. ప్రపంచంలో అందరికంటె వేగంగా బంతిని విసరగల బౌలర్ బౌలింగ్ చేస్తున్నాడు. మూడు బంతులు వేసిన తర్వాత అంపైర్ 'నోబాల్' అన్నాడు.

వెంటనే బ్యాట్స్‌మన్ అందుకుని "ఎస్ అంపైర్... దేరీజ్ నోబాల్ ఇన్ హిజ్ హేండ్" అన్నాడు.

— కవితావర్ష (గుంటూరు)



ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుతో పెళ్లి నిరాడంబరంగా జరిపించి అద్దె ఇంట్లోకి మారారు.

ఆయనకొచ్చే కొద్దిపాటి పెన్షన్‌తో ఇల్లు గడవడమే కష్టంగా వుంది. మందులు మానేశారు శివరామయ్యగారు. భర్త దుస్థితి చూసి భోరున ఏడ్వడం మినహా ఏమీ చేయలేకపోయేది అన్నపూర్ణమ్మ.

వుండే దరిద్రం లేకా దరిద్రం అంటే ఇదే కాబోలు. మగబిడ్డ వుండి కూడా తాము దిక్కులేనివాళ్లలా కాలాన్ని భారంగా ఈడుస్తున్నారా దంపతులు.

కూతుళ్లు, అల్లుళ్లు వచ్చి అప్పుడప్పుడు పరామర్శించి పోయేవారు. కొడుకూ వచ్చేవాడు. అతనితోపాటు నాంచారి వచ్చినా ఎడంగా వుండేదే తప్ప మావగార్ని పన్నెత్తి పరామర్శించేదికాదు. అత్తతోనూ అంతే ముభావంగా వుండేది. వున్న రెండురోజులూ ముళ్లమీద కూచున్నట్టు అనీజీగా ఫీలై వెళ్లిపోయేది. మంగ ఎంత దురదృష్టవంతుడు! ఆర్థికపరమైన ఇబ్బందులు లేకపోయినా అనురాగవతి... అనుకూలవతి అయిన భార్య దొరక్కపోవడం ఎంత నరకం. మంగపతి కాపురం గూర్చే అనుక్షణం దిగులుపడేది అన్నపూర్ణమ్మ.

హఠాత్తుగా ఒకరోజు శివరామయ్యగారు కన్నుమూశారు. పెద్ద కర్మకూడా జరిగిపోయింది. అన్నపూర్ణమ్మ అన్నదమ్ములు ఆమె శేషజీవితంగురించి ఒక నిర్ణయం చేశారు.

భర్తని పోగొట్టుకున్న తల్లి మంగపతి సంరక్షణలో వుండాలని. మనవడు... మనవరాలు ఆటపాటల్లో దుఃఖాన్ని కొంతవరకు మరచి ఆమె మనసుకి స్వాంతన కలుగుతుందని అన్నారు.

నాంచారి అంతమంది పెద్దలముందు నోరు విప్పలేకపోయింది. మంగపతి మేనమామల మాటకి ఎదురు చెప్పలేక మౌనంగా వుండిపోయాడు.

తన సోదరుల నిర్ణయానికి గతుక్కుమంది అన్నపూర్ణమ్మ. వారి నిర్ణయం సమంజసము. లోక సమ్మతమే అయినా వారి అభిప్రాయాన్ని ఆమె మనసు హర్షించలేకపోతోంది.

తనంటే కోడలు అకారణంగా ద్వేషం పెంచుకుంది. అలాంటి కోడలు దగ్గర తన దుఃఖాన్ని మరిచి శేష జీవితాన్ని ప్రశాంతంగా... సంతోషంగా గపడగలదా?

పెద్దల అభిప్రాయానికి తలవంచిన కోడలు తన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించి తన కుటుంబంలో వ్యక్తిగా చూడగలదా? తలవెడి కుమలిపోతున్న తన్ని ఓదార్చగలదా? ఆప్యాయంగా పలకరించి ఆదరణ చూపిస్తుందా? ఏమో! అన్నీ సందేహాలే! అన్నీ అనుమానాలే అన్నపూర్ణమ్మ మనసులో. అన్నింటిని పక్కనపెట్టి ప్రయాణమైంది.

ఒకనెల... ముప్పై రోజులకాలం... ముప్పై సంవత్సరాల్లా నెమ్మదిగా... అతిభారంగా గడిచింది అన్నపూర్ణమ్మకి. వైధవ్యంకంటే ఆమెని ఒంటరితనం ఎక్కువ బాధపెట్టింది

అందరి మధ్య వుండికూడా అడవిలో వున్నట్టు భయంకరమైన ఒంటరితనాన్ని అనుభవించింది. ఒంటరితనానికి మించిన శిక్ష మరోటి లేదేమో .

కోడలు అస్సలు మాట్లాడదు. తప్పదన్న

ట్లు వేళకి కాఫీ టిఫెన్లు... భోజనం పడేస్తుంది. పిల్లలు నానమ్మా అంటూ దగ్గరకు రాబోతే ఏయ్ మీరు పోయి చదువుకోండి అంటూ ఉరిమి చూపి గదమాయిస్తుంది. పెళ్లాం ఏవన్నా అనుకుం టుందేమోనని ముందుజాగ్రత్తగా మంగ, తల్లితో మాట్లాడ్డం మానేశాడు.

ఒక మాట లేదు మన్నవలేదు. ఆప్యాయ త లేదు ఆదరింపు లేదు. తినడం కోసమేనా తాను బ్రతుకుతోంది. ఆ మాత్రం దాని తను వీళ్లతో కల్సి వుండడం దేనికి. ఎవ్వరికి పనికిరాని బ్రతుకెందుకు.

పెపెచ్చు తెల్లారి లేచింది మొదలు వెధవ మొహం చూడాల్సి వస్తోంది. ఛీఛీ అని కోడలి ఛీదరింపులు, చీత్కారాలు.

"పని చెయ్యడానికి ఎవ్వరూ లేకపోయి వా కంచాలు కంచాలు మింగడానికి తక్కువ లేరు మంద" కోడలి విసుర్లు.

మందా? ఎవరు మందా? తనొక్కత్తి కోడలికంటికి మంచిలా కనిపిస్తున్నావా? గుప్పెడు మెతుకులు విదిల్చడానికా ఆ బాధ. పనిలో సాయం చెయ్యబోతే విసురుగా చేతిలోంచి లాక్కుంటుంది. వంటగదిలోకి అసలు ప్రవేశమే లేదు.

తల్లి మాటలకి పిల్లలు అన్నపూర్ణమ్మవే పు దోషిలా చూసేవారు.

నాంచారి అరుపులువిని "అమ్మా! పొద్దస్తమానం అలా కూచోకపోతే కాస్త పనిలో సాయం చెయ్యకూడదూ? ఒక్కత్తే ఎందరికని చెయ్యగలదు" మంగపతి పెత్తనం చేసేవాడు.

ఏమీ అవలేక బాధగా నిట్టూర్చేది అన్నపూర్ణమ్మ.

ఎవ్వరి ప్రేమానురాగాలకి నోచుకోని... ఎవ్వరికీ అక్కరలేని ఈ బ్రతుకెందుకు? భగవంతుడా నీ చెంతకు ఎందుకు పిలిపించుకోవు... అనుక్షణం నా వైధవ్యాన్ని గుర్తుచేస్తూ ఈటెల్లాంటి మాటలు అనుక్షణం

## మంచు

ఎడారిలో ఎడతెగకుండా మంచు కురిసిందంటే ఎవ్వరూ నమ్మరు. అయితే 1979లో సహారా ఎడారిలో అంతులేని మంచు కురిసింది! విపరీతంగా కురిసిన ఆ మంచువల్ల ఒంటెలు దారికనబడక నడవలేకపోయాయి.

— కొడిమెల శ్రీరామమూర్తి



హృదయాన్ని రంపపుకోతకి గురిచేస్తుంటే ఈ జీవితం ఎందుకు?

తన కాలాన్నంతా భర్తని గుర్తుచేసుకుంటూ... ఏడుస్తూ గదిలోనే గడిపేది అన్నపూర్ణమ్మ. సంతోషం లేక శూన్యంగా వున్న ఆమె మనసుకి కాలం స్తంభించినట్టయింది. నిద్రపట్టక అశాంతిగా పొర్లుతోంది.

"ఏమండీ! అత్తయ్యని మరీ బాధపెట్టేస్తున్నానేమోనండి... ఆ పాపమంతా మన పిల్లల్ని చుట్టుకుంటుందేమోనని నాకు భయంగా వుంది" పక్క గదిలోంచి కోడలు మాటలు సన్నగా వినిపించాయి అన్నపూర్ణమ్మకి. కొడుకు జవాబుకోసం చెవులు రిక్కించింది.

"నువ్వు నోర్మూయ్... వెధవ సెంటిమెంటూ నువ్వూనూ. ఈ రోజున కంచంలో నాలుగు మెతుకులు మిగిలించే దిక్కులేక నా పంచన చేరింది"

"చేరడం ఏంటి... అది మీ బాధ్యత"

"బాధ్యత గోంగూర... చిన్నప్పటినుండి నేను పెంచిపోషిస్తున్న కసి... ఈరోజు తీర్చుకునే అవకాశం నాచేతికొచ్చింది.

భర్తవైపు భయంగా చూసింది నాంచారి. అతనో వింతమృగంలా కన్పించాడు.

"జన్మనిచ్చి... పెంచి పెద్దచేసిన తల్లి మీద కసా?" వింతగా చూసింది.

"అవును. కసే... ఇరవై ఎనిమిదేళ్ళ ఉద్యోగం సంపాదించలేకపోయాను... అందుకే అందుకే"

"అత్తయ్య మామయ్య తిట్టేవారా?... కించపరిచేలా ప్రవర్తించేవారా? ఉద్యోగం సంపాదించలేని అసమర్థుడివని సాధించేవారా?"

"లేదు! నన్నెప్పుడూ ఒక్క మాట అనలేదు"

"ఏమో! వాళ్ళునన్ను నాలుగు తిట్టినా నాకు అంత బాధుండేది కాదేమో! వాళ్ళు ఏం మాట్లాడినా... ఏం చేసినా నన్ను హేళన చేస్తున్నట్టుండేది... నా అసమర్థతని ఎత్తిచూపినట్టుండేది"

"బావుంది మీ వరస... మీ అంతట మీరే అర్థంపర్థంలేని ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలతో ఏవో ఊహించుకుని ఎదుటి మనుష్యులని బాధపెట్టడం అదో మానసిక వ్యాధి..."

"కొడుకంటే ఏమిటో... అతని ఆలోచనలేమిటో... అతని అంతర్యం ఏమిటో పూర్తిగా అర్థమై ఇహ వినదలుచుకోలేదు అన్నపూర్ణమ్మ. అప్పటికప్పుడే ఆమె ఒక బలమైన నిర్ణయాన్ని తీసుకుని తృప్తిగా నిద్రపోయింది.

◇ ◈ ◇

"ఏమండీ! అత్తయ్య ఎక్కడికో వెళ్ళిపోయిందండి!" మరునాటిరోజు నాంచారి అరుపులతో మెలకువ వచ్చింది మంగపతికి.

నాంచారి చేతిలోని ఉత్తరాన్ని లాక్కుని గబగబా చదివాడు.

చిరంజీవి మంగపతికి మీ అమ్మ దీవించి, సూటిగా విషానికి వస్తాను. దురదృష్టవశాత్తు రాత్రి మీ సంభాషణ విన్నాను. నా దోషం ఏమీ లేకుండానే అకారణంగా నా మీద కసిని పెంచుకున్నావు. నీ మనసేంటో తెలుసుకోకుండానే ఆ పుణ్యాత్ముడు వెళ్లిపోయాడు.

తొలిచూలు మగబిడ్డని ఎంతో మురిసిపో

యాము. ముగ్గురాడపిల్లల మధ్య చుక్కల్లో చంద్రుడిలా నిన్ను పెంచాము. మీ నాన్న నిన్ను గుండెలమీద పెంచుకున్నారు.

నీవు చదువులో అంత చురుకుగా లేపోయినా నిన్ను ఏనాడూ పల్లెత్తు మాట అనలేదు. ఎన్నిసార్లు ఫెయిలైనా మారు మాట్లాడకుండా నీకు ఫీజులు కట్టాము.. నీ ప్రయత్నలోపం లేకుండా నీవంతు కృషిచేస్తున్నా నిన్ను ఎలా నిందించగలం... ఆ సరస్వతీమాతకు నీమీద దయలేదు అనుకునేవారము.

నీకు డిగ్రీ పూర్తయ్యేసరికి ఇరవైఏడేళ్లు.. . చదువే పూర్తికానివాడివి ఉద్యోగం రాలేదని ... నీవు సంపాదించలేదని దూషించే అల్పులం కాదు.

ఇవన్నీ నీ భార్యముందు నీవే చెప్పుకున్నావు. నిజాన్ని ఒప్పుకున్నావు. చదువులో అడుగడుగునా అపజయాన్ని చవిచూసిన నీలో నీకు తెలీకుండానే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ మొదలైంది. అందువల్లే ఏనాడూ నిన్ను ఒక్క మాట అనకపోయినా ఆత్మన్యూనతాభావంతో కొట్టుమిట్టాడే నీకు మేము ఎవరితో మాట్లాడినా ఏం మాట్లాడినా నీలో నీవు ఏవో ఊహించుకుని కుంచించుకుపోయేవాడివి కాబోలు.

దాన్ని చూసిన మేము అతి బిడియస్తుడిగా... అతి సౌమ్యుడిగా ఊహించేవాళ్లమేకానీ ఆ ఆత్మన్యూనతాభావం నీతోపాటు పెరిగి పెద్దయి నీలో భయంకరమైన ఆలోచనలని రేకెత్తిస్తుందని ఊహించలేకపోయాము.

నువ్వు ఉద్యోగస్తుడివైన తర్వాత క్రమంగా మామీద నీ ఆలోచన ప్రభావం వున్నా మేము గుర్తించలేదు. ఎందుకంటే ప్రతిదానికీ ప్రతి పనికీ నీ భార్యమీదే నెట్టేసేవాడివి. ఆ విధంగా ఆమెని మాముందు పరమ గయ్యాళిగా... మేమంటే అయిష్టత చూపుతున్న వ్యక్తిగా ఆమెని చిత్రీకరించావు. నీ మాటలు నమ్మి నీకు అనుకూలవతి భార్యగా లభించనందుకు నేను మీ నాన్న ఎంతో వ్యథచెందాము. బాధపడ్డాము.

మేమంటే నీకు ఇష్టంలేకపోతే మాటికి ఆ మాట చెబితే ఎంతో సంతోషించేవాళ్లం. మమ్మల్ని దూరంగా వుంచడంకోసం ఇంత నాటకం ఆడనక్కర్లేదు. అనుక్షణం నన్ను ద్వేషించే నీ ఇంట్లో మనశ్శాంతితో వుండలేదు. మీ నాన్నని తలచుకుంటూ ఎక్కడో పండుటాకులా రాలిపోతాను. చివరిగా ఒక్క మాట. ప్రతిక్షణం నా కళ్లముందు తిరుగుతూ నీలో ఇంకా కసిని.... ద్వేషాన్ని పెంచలేను. అందుకే... అందుకే ... మీ అందరికీ దూరంగా... కనిపించనంత దూరంగా వెళ్లిపోతున్నాను. నాకోసం వెదికి శ్రమ తీసుకోవద్దు. మీ అందరికీ నా ఆశీస్సులు. కొడుకుగా నిర్వర్తించలేని నీ బాధ్యతలని తండ్రిగానైనా ఆనందంగా నిర్వహించు.

ఇట్లు

కన్నకొడుకు ద్వేషానికి గురైన దురదృష్టవంతురాలైన నిర్భాగ్యపు తల్లి.

